క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



బైరాగినాయుడు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: మండలంలోని దుప్పలపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, విశ్రాంత ఉపాధ్యాయుడు వైకుంఠం బైరాగినాయుడు అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి, బైరాగినాయుడు మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.విజయభాస్కరరావు, మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా పారాది వంతెన అప్రోచ్ రోడ్డు పనులు



రోడ్డు పనుల కోసం సేకరించిన మెటీరియల్

బొబ్బిలి: మండల పరిధిలోని పారాది వంతెన అప్రోచ్ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వేగావతి నదిలో నిర్మిస్తున్న ఈ రోడ్డు పనులు ప్రస్తుతం ఊపందుకున్నాయి. తొలుత గ్రావెల్ రోడ్డు వేసే పనులు ముమ్మరం చేశారు. నిర్మాణ సామగ్రి పూర్తి స్థాయిలో సమకూర్చామని, పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు.

వీనులవిందుగా గీతాలాపన



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత వేణుగోపాలనాయుడు

బొబ్బిలి: స్థానిక శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఘంటసాల గీతాల ఆలాపన శ్రోతలకు వీనులవిందు చేసింది. యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాటల దేవుడు ఘంటసాల స్వరపరిచిన, ఆలపించిన సినీగీతాలను పలువురు గాయనీగాయకులు ఆలపించారు. అంతకు ముందు ఘంటసాల చిత్రపటానికి సంగీతాభిమానులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేత శంబంగి వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించడం మన సంప్రదాయమని, కళాకారులను గౌరవించాలన్నారు. అనంతరం ఘంటసాల పాటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఆయన చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ప్రత్యేక తరగతుల్లో ఆరుబయట చదువుకుంటున్న బాడంగి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

బాడంగి: రానున్న పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ప్రస్తుతం జరిగే సమ్మేటివ్ పరీక్షలతో పాటు పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులంతా ఉత్తీర్ణులు కావాలన్న సదుద్దేశ్యంతోనే ఈ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్న వారు 125 మంది వరకు ఉన్నారన్నారు. వీరికి పాఠశాల ప్రారంభ సమయానికి ముందు, తర్వాత, ప్రభుత్వ సెలవుల్లో ఒక్కో సబ్జెక్ట్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహించి, సందేహాల నివృత్తితో పాటు అధిక మార్కుల సాధనకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

బొబ్బిలి: మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని చైల్డ్ రైట్స్ ఫోరం చైర్మన్ పి.చిట్టిబాబు అన్నారు. స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మానవ హక్కులపై అవగాహన కల్పించారు. స్వేచ్ఛ, సమానత్వం వంటి విషయాలు తెలియజేయడంతో పాటు వెట్టిచాకిరి, బానిసత్వం నుంచి రక్షణ పొందే హక్కు మానవ హక్కు కిందికే వస్తుందన్నారు. మానవ హక్కులతో ప్రతీ వ్యక్తి స్వేచ్ఛాయుత జీవనం సాగించవచ్చన్నారు. మానవ హక్కులకు భంగం కలిగితే ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బి.శంకరరావు, చంద్రరావు, రామాంజనేయ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసిన మేలు వివరించండి

- సోషల్ మీడియా కన్వీనర్లు, వర్కర్ల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి



సమావేశానికి హాజరైన సోషల్ మీడియా కన్వీనర్లు, వర్కర్లు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం చేసిన మేలును ప్రతి ఇంటికీ వెళ్లి, వివరించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సూచించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన సోషల్ మీడియా కన్వీనర్లు, సోషల్ మీడియా వర్కర్ల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. గతంలో టీడీపీ హయాంలో ఆ పార్టీ ప్రజలను మోసగించిన తీరు ఎండగడుతూనే, ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న మంచి పనులను తెలియజేయాలన్నారు. టీడీపీ హయాంలోని జన్మభూమి కమిటీల అధికార పెత్తనం, ఇప్పటి వలంటీర్ వ్యవస్థ సేవాభావం ప్రజలే గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని, ఆయన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు అన్ని రంగాల్లో న్యాయం జరిగేలా చూస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో 98.5 శాతం హామీలు నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థతో లబ్ధిదారుల వద్దకే పథకాలు అందించడం జరుగుతోందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్క పథకం కావాలన్నా నాయకులు, అధికారులు, జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అర్హులై ఉంటే చాలని, ప్రభుత్వ పథకాలు ఇంటికే వస్తున్నాయన్నారు. ఇదంతా సీఎం జగనన్న సుపరిపాలన అని, ఇవే విషయాలను ప్రజలకు తరచూ తెలియజెప్పాలన్నారు. సోషల్ మీడియా కన్వీనర్లు, కో-ఆర్డినేటర్లు, వర్కర్లు అంతా సమన్వయంతో పనిచేసి, మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. వైఎస్సార్ సీపీ నేత శంబంగి వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులంతా సైనికుల్లా పనిచేయాలని కోరారు. రాష్ట్రంలో జరిగే అభివృద్ధి, సంక్షేమంతో పాటు బొబ్బిలి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని కూడా సోషల్ మీడియా వేదికగా ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించే ప్రచార పోస్టర్లు, చిత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత శంబంగి శ్రీకాంత్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, బాడంగి జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

● అభివృద్ధి 'బాట'





చిత్రంలో కనిపిస్తున్నది సంతకవిటి మండలంలోని గోవిందపురం గ్రామ ఎస్సీ కాలనీ రోడ్డు. గతంలోని టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఈ రోడ్డు చాలా అధ్వానంగా ఉండేది. ఏ చిన్నపాటి వర్షం కురిసినా ఇక్కడి మట్టిరోడ్డు బురదమయమయ్యేది. దీంతో ఆ దారిన రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గ్రామీణ అభివృద్ధిపై దృష్టిసారించిన ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.5 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో 120 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించారు. ఇప్పుడు చాలా హాయిగా రోడ్డుపై ప్రయాణిస్తున్నామని వాహనదారులు, పాదచారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. -సంతకవిటి

జ్యోతిష్య శాస్త్రంలో డాక్టరేట్



సత్యశ్రీనివాసరావును సన్మానిస్తున్న దేవాంగ సంక్షేమ సంఘ సభ్యులు

రాజాం: పట్టణానికి చెందిన పిచిక సత్యశ్రీనివాసరావు జ్యోతిష్య శాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందారు. అమెరికా డేస్ప్రింగ్ వర్సిటీ టెక్సాస్‌లో జ్యోతిష్య శాస్త్రంలో చేసిన పరిశోధనకు గాను అక్కడి వర్సిటీ ఆయనకు డాక్టరేట్ పట్టాతో సత్కరించింది. రాజాం వచ్చిన ఆయనను రాజాంలోని దేవాంగ సంక్షేమ సంఘం ఆదివారం సన్మానించింది. విశాఖపట్నం దేవాంగ సంక్షేమ సంఘ గౌరవాధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ, తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యుడు కర్ర రవి మాట్లాడుతూ దేవాంగ కుటుంబానికి చెందిన సత్యశ్రీనివాసరావు పట్టుదలతో డాక్టరేట్ పొందడం ఒక ఎత్తైతే అమెరికాలో జ్యోతిష్య శాస్త్రంలో ఈ డాక్టరేట్ పొందడమనేది మరో ఎత్తు అని ప్రశంసించారు. కార్యక్రమంలో రాజాం నగర పంచాయతీ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దాసరి అప్పారావు, కార్యదర్శి బనిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: సీఎంఆర్ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) పేదలకు వరం వంటిదని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండలంలోని పెనుబాక గ్రామానికి చెందిన గంగు సతీష్‌కు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే ఆదివారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న ఎంతో మంది నిరుపేదలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పెద్దమనసుతో ఆదుకుంటున్నారన్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన సతీష్ ఇటీవల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడని, పేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో వైద్యం, మందుల ఖర్చుల కోసం ఆయనకు సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్లు లావేటి రాజగోపాలనాయుడు, కరణం సుదర్శనరావు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, రాజాం వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, సర్పంచ్ డబ్బాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వనభోజనాలు

రాజాం: స్థానిక పట్టణంలోని జీఎంఆర్ ఐటీ రోడ్డు, గాయత్రికాలనీ రోడ్డు, కంచరాం గ్రామ మామిడితోటల్లో ఆదివారం వనభోజనాల సందడి కనిపించింది. కార్తీకమాసం అందులోనూ ఆదివారం కావడంతో పలు కుల సంఘాల వారు పిక్నిక్‌లు చేసుకుని, కుటుంబాలతో సరదాగా గడిపారు. సినిమా పాటలకు చిన్నారులు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇటువంటి కార్యక్రమాలు సంఘాల ఐక్యతకు నిదర్శనమని వక్తలు అన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

బొబ్బిలి: మండలంలోని జగన్నాథపురం సచివాలయం పరిధిలో ఉన్న కృష్ణాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వర్గాలు ఆదివారం వెల్లడించాయి. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొనే ఈ కార్యక్రమానికి మండల స్థాయి వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అధికారులంతా హాజరు కావాలని కోరాయి.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



తెర్లాం: విద్యార్థితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి



బాడంగి: పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, కథలు చదివించడం, చెప్పించడం చేయించారు. అనంతరం లైబ్రేరియన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతీ విద్యార్థి పాఠశాల స్థాయి నుంచే తప్పనిసరిగా పుస్తక పఠనంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులతో లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ పుస్తకాలు, కథలు చదివించడం చేయించారు. విజ్ఞానానికి నిలయాలైన గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జీవామృతంతో పంటలకు మేలు



జీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా తయారు చేసే జీవామృతంతో పంటలకు మేలు చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ కిరణ్ అన్నారు. మండలంలోని సోమరాజుపేటలో కోట్ల నారాయణరావుకు చెందిన పంట పొలంలో ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంభిస్తూ సాగు చేస్తున్న మిరప పంటను ఆయన ఆదివారం పరిశీలించారు. పంట ఆరోగ్యవంతంగా ఉండడంతో పాటు అధిక దిగుబడి వచ్చేలా ఆశాజనకంగా సాగు ఉందన్నారు. నేల, వాతావరణం, నీటి అనుకూలత తదితర అంశాలు బట్టి పంటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం జీవామృతం తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు, వీహెచ్‌ఏ అసిరినాయుడు, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



చందాపురంలో సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రజలను అప్రమత్తం చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారులు

రామభద్రపురం: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సీజనల్ వ్యాధుల కట్టడికి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. అప్రమత్తమైన అధికారులు వర్షాకాలం, మారుతున్న వాతావరణం దృష్ట్యా ప్రజలు సీజనల్ వ్యాధులు బారినపడే అవకాశం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎక్కడా అనవసర నీటి నిల్వలు లేకుండా చూడాలని, నీరు నిల్వ ఉంటే దోమలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని దీంతో దోమల ద్వారా మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. మరో వైపు పీహెచ్‌సీ, వైద్యారోగ్య సిబ్బంది, పంచాయతీ అధికారులు కూడా గ్రామాల్లో ప్రజారోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు దిలీప్‌కుమార్, శిరీష ఏఎన్ఎంలు, ఆశవర్కర్లతో కలిసి గ్రామాల్లో తిరుగాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండొచ్చన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత



రేగిడి: వన్నలిలో ఇరుముడి కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తులు



బాడంగి: కోడూరులో జరిగిన భాగవత సప్తాహం కార్యక్రమంలో భగవద్గీత సారాంశం చదివి వినిపిస్తున్న స్వామినాయుడు



రేగిడి: దేవుదల గీతాశ్రమంలో ఆధ్యాత్మిక సందేశం వినిపిస్తున్న వక్త రమణ



రాజాం సిటీ: పాలకొండ రోడ్డులోని ధన్వంతరి విద్యాలక్ష్మి గణపతి ఆలయంలో భక్తుల పూజలు



బొబ్బిలి: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో దీక్షాపరుల పడిపూజ

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో పలుచోట్ల జరిగిన భక్తిపారవశ్య కార్యక్రమాలతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. కార్తీకమాసం పురస్కరించుకుని, అయ్యప్ప, భవాని, శివ మాలాధారణ చేసిన దీక్షాపరులతో పాటు సాధారణ భక్తులతో ఆలయాలు ఆదివారం కిటకిటలాడాయి. గంటల తరబడి క్యూలైన్లలో వేచి, దైవదర్శనం చేసుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి, భగవంతుడి పట్ల తమకున్న భక్తి శ్రద్ధలను చాటుకున్నారు.

-సాక్షి నెట్‌వర్క్

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బాడంగి: మండలంలోని పాల్తేరు గ్రామంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ ఉడమల అప్పలనాయుడు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విచ్చేసి, కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

శ్మశానవాటిక ఏర్పాటు

విజయనగరం రూరల్: మండలంలోని ద్వారపూడి గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు రూ. 10 లక్షలతో నిర్మించిన శ్మశానవాటికను ఎంపీపీ మామిడి అప్పలనాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో శ్మశానవాటిక నిర్మించాలన్న యాదవ సోదరులు కోరిక మేరకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషితో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జెడ్పీ నుంచి రూ. 10 లక్షలు నిధులు మంజూరు చేశారన్నారు. దీంతో శ్మశానవాటిక నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యా, మానవ వనరుల సమన్వయకర్త డోల మన్మధకుమార్, జిల్లా యాదవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు మన్యాల కృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.